


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం నవంబర్ 22 2024 సంపుటి :0 సంచిక : 44 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

## రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలి: దామోదర రాజనర్సింహ



2 లో

# నదులు కనుమరుగైతే మనిషి మనుగడే ప్రశ్నార్థకం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి.. వాటిని కనుమరుగయ్యేలా చేస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజారోగ్యం, పటిష్ఠ ఆర్థిక పర్యావరణ కోణాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ శాపంగా మిగిలిపోకూడదు అని సీఎం సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే.. ప్రజా ప్రభుత్వ సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. ఇది ఈ తరానికే కాదు.. భావితరాలకు మేలు చేసే నిర్ణయమని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికి, వ్యవస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల 'మూసీ పునరుజ్జీవం– ప్రక్షాళన' పేరుతో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తోంది. ఈనేపథ్యంలో పలువురి నుంచి సీఎం నిర్ణయం సరికాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో తనదైన శైలిలో స్పందించారు.



## ముగిసిన తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు




**తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీవోఏ) ఎన్నికలు ముగిశాయి.**

హైదరాబాద్: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీవోఏ) ఎన్నికలు ముగిశాయి. ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్ వేదికగా టీవోఏ కార్యవర్గ ఎన్నికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి. అధ్యక్ష పదవి కోసం రాష్ట ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ పోటీపడ్డారు. ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం ఎన్నిక జరుగుతుండగా.. మిగతా స్థానాలకు సభ్యుల ఎన్నిక లాంఛనం కానుంది. ప్రధాన కార్యదర్శి పదవి కోసం బాబురావు, మల్లారెడ్డి మధ్య పోటీ ఉండగా.. కోశాధికారి కోసం సతీష్ గౌడ్, ప్రదీప్ కుమార్ రేసులో ఉన్నారు.

2 లో




## డిసెంబర్ 9 నుంచి తెలంగాణ గ్రూప్-2 హాల్ టికెట్ల డౌన్‌లోడ్

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-2 పరీక్షల హాల్ టికెట్లను డిసెంబర్ 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. ఈ నోటిఫికేషన్‌లో మొత్తం 783 గ్రూప్- 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు

# భిన్నత్వంలో ఏకత్వం..

## మనదేశ గొప్పతనం: మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్: దక్షిణ భారతదేశంలోనే తొలిసారి తెలంగాణలో లోక్‌మంథన్ నిర్వహించడం గౌరవంగా ఉందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు రుచులను అతిథులు ఆస్వాదించాలని మంత్రి కోరారు. భౌగోళికంగా, చారిత్రాత్మకంగా తెలంగాణను మినీ ఇండియాగా చెప్పుకుంటారని జూపల్లి వివరించారు. సాంకేతికత లేనప్పుడే గొప్ప కట్టడాలను రాష్ట్రంలో నిర్మించారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనం అని.. ఇక్కడ ఉన్న విభిన్న సంస్కృతులను అతిథులు వీక్షించాలని మంత్రి సూచించారు.

శిల్పారామంలో ఏర్పాటుచేసిన లోక్‌మంథన్‌లో జరిగే ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలందరూ తిలకించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. లోక్‌మంథన్ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి 2500 మంది అతిథులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ సామాజిక అంశాలపై చర్చ జరుగుతుందని కేంద్రమంత్రి తెలిపారు.

## ఈ నెల 29న తెలంగాణ వ్యాప్తంగా దీక్షా దివస్ : కేటీఆర్ పిలుపు



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 29వ తేదీన దీక్షాదివాస్ ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు భారాస కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివాస్ నిలుస్తుందన్నారు. 2009 నవంబర్ 29వ తేదీన కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందని తెలిపారు. ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసిందన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని చెప్పారు. ఈ నెల 29న కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొననున్నారు.

# అదానీని అరెస్ట్ చేయాలి..

## సెబి చీఫ్‌ను విచారించాలి: రాహుల్ గాంధీ డిమాండ్

అదానీని అరెస్ట్ చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సెబీ చీఫ్‌పైనా విచారణ జరపాలన్నారు.



2 లో

# నటుడు నాగార్జునపై వ్యాఖ్యల కేసు

## కౌంటర్ దాఖలుచేసిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): సినీనటుడు నాగార్జున వేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాగార్జున దావా వేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన కౌంటర్‌ను కొండా సురేఖ తరఫు న్యాయవాది గురుప్రీత్ సింగ్ దాఖలు చేశారు. నాగార్జున తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు.



2 లో

# ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్

## లగచర్ల ఘటనపై సిపిఎం విమర్శలు




2 లో

# అద్దె బకాయిలు చెల్లించని మాజీ ఎమ్మెల్యే

## నోటీసులు ఇచ్చిన స్పందించని ఆశన్నగారి జీవన్ రెడ్డి మరోమారు బకాయిల కోసం ఫైనాన్స్ కంపెనీ నోటీసులు




2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం నవంబర్ 22 2024

# సంపాదకీయం

## చట్టసభల్లో మీ నడతను చరిత్ర గమనిస్తోంది!




న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో నేరుగా ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించే ఏకైక వ్యవస్థగా భారత రాజ్యాంగంలో శాసన వ్యవస్థకు విశిష్ట స్థానం ఉంది. 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించే ముందు రాజ్యాంగ సభలో అధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగపు మూల స్వరూపం గురించి మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు ప్రజాభీష్టం మేరకు నడచుకోవాల్సి ఉంటుందని, ఈ ప్రజాభీష్టం నిరంతరం చట్టసభల్లో ప్రజాప్రతినిధుల ద్వారాను, అడపదడపా నేరుగా సార్వత్రిక ఎన్నికల ద్వారాను వ్యక్తమవుతుందని అన్నారు. ఇదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్రాల మంత్రివర్గాలు ప్రజలు నేరుగా ఎన్నుకునే లోక్‌సభకు, ఆయా రాష్ట్రాల శాసనసభలకు జవాబుదారీగా ఉండాలని రాజ్యాంగపు అధికరణాలు 75(3), 164(2) నిర్దేశిస్తున్నాయి. సభలో మెజారిటీ ఉంది కదా అని ప్రభుత్వాలు ఇష్టానుసారం వ్యవహరించడానికి లేదని, చట్టసభకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని ఈ అధికరణాలు చెబుతున్నాయి. చట్టసభల్లో ప్రతి సభ్యుడికీ, ముఖ్యంగా ప్రతిపక్షానికి బలాన్నిచ్చే అధికరణాలివి. తదనుగుణంగా చట్టసభల నియమావళిలో సభ్యులకు, ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని నిలదీసే అధికారాన్నిచ్చే సాధనాలెన్నో పొందుపరచారు.

ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సమావేశాలు జరుగుతున్న ఈ తరుణంలో స్వయానా ముఖ్యమంత్రి ఈ జవాబుదారీతనం గురించి మాట్లాడటం విశేషం. 16వ శాసనసభకు నూతనంగా ఎన్నికైన సభ్యులను ఉద్దేశించి నవంబరు 12న జరిగిన ఒక అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ%-% ప్రతిపక్షం సభలో లేనంత మాత్రాన ప్రభుత్వం ఎవరికీ జవాబివ్వనక్కరలేదని భావించడం సరికాదని, ప్రతి సభ్యుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం పనితీరులో లోపాలుంటే ఎత్తి చూపడానికి సభను, సభ విధివిధానాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్బోధించారు. అప్పుడే ప్రజలకు మెరుగైన పాలన అందించగలమని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న సభా నాయకుడు 'నా ప్రభుత్వాన్ని నిలదీయండి' అని సభ్యులందరికీ పిలుపునివ్వడం అరుదే కాదు, అసాధారణం కూడా. దశాబ్దాలుగా శాసనసభ్యుడిగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసి సుపరిపాలనకు జవాబుదారీతనం ఎంత ముఖ్యమో అనుభవపూర్వకంగా ఆకళింపు చేసుకున్న ఒక రాజనీతిజ్ఞుడు చెప్పిన హిత వచనాలవి. ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా, పటిష్టంగా ఉంటేనే ప్రజాహితం సురక్షితమన్న నమ్మకం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మాటల్లో నిబిడీకృతమై ఉంది. ప్రశ్నించడం, చర్చించడం ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలని విశ్వసిస్తే తప్ప ఇలాంటి సందేశాలు వెలువడవు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ అమాత్యులు అప్రమత్తంగా ఉండాలని, సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సర్వదా సిద్ధంగా ఉండాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభా ముఖంగా సూచించడం సభలో సత్సంప్రదాయాలు కొనసాగాలన్న అనుభవజ్ఞుల తపనకు అద్దం పడుతోంది.

'సంపద సృష్టి', 'సంపద వ్యాప్తి' గురించి తరచూ ప్రస్తావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నవంబరు 12న అవగాహన కార్యక్రమంలో విభిన్న సందర్భంలో ఈ పద ప్రయోగం చేసి ఒక కొత్త కోణం జోడించారు. శాసనసభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ ఆయన నేటి తరం శాసనసభ్యులు రాబోయే రోజుల్లో సమాజానికి ఆస్తిగా, సంపదగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. తన అర్ధ శతాబ్ది రాజకీయ అనుభవాన్ని రంగరించి, ఆదర్శ శాసనసభ్యుడు ఎలా నడచుకోవాలో చంద్రబాబు నాయుడు కొత్త సభ్యులకు పాఠంలా చెప్పారు. ఉత్తమ సంప్రదాయాలు నెలకొల్పాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం పొందగలుగుతారని ఆనాడు ముఖ్యమంత్రి సోదాహరణంగా చేసిన ఉద్బోధ భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని కోరుకునే శాసనకర్తలందరికీ కరదీపిక. ముఖ్యమంత్రి సందేశం నైజీరియాకు చెందిన విశ్వవిఖ్యాత సాహితీవేత్త చిన్వా అచేబీ ప్రజాస్వామ్యం గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని పోలి ఉంది. 'ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే విద్యావంతుల భాగస్వామ్యంబీ చైతన్యం, నైతికత మూర్తీభవించిన నాయకత్వం అవసరం' అన్నారు అచేబీ.

ప్రభుత్వాన్ని నిలదీయడం, ప్రజా సమస్యలపై చర్చించి శాస్త్రీయ పరిష్కారాలు సూచించడం, చట్టాలు చేయడం %-% ఇవీ చట్ట సభల సభ్యుల ప్రధాన కర్తవ్యాలు. దురదృష్టవశాత్తు స్థానిక సంస్థలు, కార్యనిర్వాహక వ్యవస్థలోని ఇతర ప్రభుత్వ విభాగాలు సాధారణంగా నిర్వర్తించవలసిన విధులు చట్టసభల సభ్యులకు బదిలీ అవుతున్నాయి. చట్టసభల సభ్యులు సులువుగా ప్రజలకు అందుబాటులో ఉంటారు కనుక ప్రజల రోజువారీ సమస్యలు ఆలకించి, వాటి పరిష్కారానికి ఎక్కువ సమయం వెచ్చించ వలసి వస్తోంది. దీనివల్ల వారు శాసనకర్తలుగా తమ ప్రధాన కర్తవ్యాల నిర్వహణకు తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు.

తీవ్రమైన, తక్షణ సమస్యల పరిష్కారానికి సభ దృష్టిని, ప్రభుత్వం దృష్టిని ఆకర్షించడం ఒక ఎత్తు అయితే, దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే చట్టాలు చేయడం, విధానాల రూపకల్పనలో భాగస్వాములు కావడం మరొక ఎత్తు. ఇందుకు అంకితభావం, అప్రమత్తత, పరిశ్రమ, పరిశోధన ఎంతో అవసరం. ప్రచారకాంక్షతో సభలో నిబంధనలు ఉల్లంఘించే వారిని ఆ క్షణం గడిస్తే ఎవరూ గుర్తు చేసుకోరు. సభలో తగు సమయంలో, తగు రీతిలో, సందర్భోచితంగా స్పందిస్తూ, నియమాలను, సభాపతి ఆదేశాలను గౌరవిస్తూ పూర్తి సన్నద్ధతతో విధులు నిర్వర్తించేవారినే చరిత్ర గుర్తుంచుకుంటుంది. తెలుగునాట వావిలాల గోపాలకృష్ణయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, కొణిజేటి రోశయ్య, చెన్నమనేని రాజేశ్వరరావుబీ జాతీయ స్థాయిలో హిరేన్ ముఖర్జీ, జార్జ్ ఫెర్నాండెజ్, మధు దండవతే, ఇంద్రజిత్ గుప్తా, సోమ్‌నాథ్ చటర్జీ, జైపాల్‌రెడ్డి లాంటి ఉత్తమ పార్లమెంటరీ వేత్తలు చట్టసభల్లో తమ పని తీరుతో చరిత్ర పుటల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. నిజానికి వీరిలో ఎవరికీ అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా లేదు. వారిలో కొందరి పార్టీలకు అప్పట్లో పార్లమెంటరీ గ్రూపులుగా సైతం గుర్తింపు లేదు. అయినా వారు తమ విధులు అద్భుతంగా నిర్వర్తించడానికి ఇవేవీ అడ్డు రాలేదు. రాజ్యాంగం పట్ల, ప్రజల పట్ల, సభ పట్ల వారికున్న నిబద్ధతే వారిని రాణింపజేసింది. బహుశా ఈ మహామహులను దృష్టిలో ఉంచుకునే చంద్రబాబు నాయుడు శాసనసభ్యులు భావితరాలకు ఆస్తిగా, సంపదగా అవతరించాలని ఆకాంక్షించి ఉంటారు.

ఈ దఫా తొలిసారి ఎన్నికైన 84మంది శాసనసభ్యులకు ఇదొక సువర్ణావకాశం. శాసనసభ సమావేశాలు సజావుగా సాగుతున్నాయి. రోజువారీ పని గంటలు పెరిగాయి. ఇప్పటికే సభా నియమావళిలో సభ్యులకు అందుబాటులో ఉన్న సాధనాలెన్నో సభ్యులకు పరిచయమయ్యాయి. ప్రశ్నలు, స్వల్ప వ్యవధి ప్రశ్నలు, శూన్య కాలం, స్వల్ప కాలిక చర్చ, అత్యవసర ప్రస్తావనలు, సావధాన ప్రస్తావనలు, అర్ధ గంట చర్చ, మంత్రుల ప్రకటనలపై చర్చ, తాత్కాలిక బడ్జెట్, సాధారణ బడ్జెట్ ఆమోదం, పలు బిల్లుల ఆమోదం- ఇలా సభా ప్రక్రియలెన్నో నూతన సభ్యులు స్వల్ప వ్యవధిలోనే అవగతం చేసుకోగలిగారు. సభ్యులు సమావేశాలు

ఎడిటర్
ఆర్ చైతన్య

## రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలి: దామోదర రాజనర్సింహ

మొదటిపేజీ తరువాయి

మంచిర్యాల: రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగిని తమ క్లయింట్‌గా భావించాలని చెప్పారు. మంచిర్యాలలో రూ.360 కోట్లతో చేపట్టనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజనర్సింహ మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేరనే విమర్శ రావొద్దని వైద్యాధికారులకు సూచించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 7 వేలకుపైగా నర్సు పోస్టులను భర్తీ చేసిందన్న ఆయన.. ప్రతి మండలానికి 2 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఉండేలా చర్యలు చేపడతామన్నారు.

## ముగిసిన తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

ఇదిలా ఉంటే టీవోఏ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న ఉద్దేశంతో ఉన్న జితేందర్‌రెడ్డి, చాముండేశ్వర్‌నాథ్ వర్గాలు.. తమ ప్రయత్నాలను చివరి వరకు కొనసాగించాయి. 68 మంది సభ్యులు ఉండగా.. 59 ఓట్లు పోలయ్యాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో.. ఎన్నికల ఫలితాలు తర్వాత ప్రకటించనున్నారు.

## అదానీని అరెస్ట్ చేయాలి..

### సెబి చీఫ్‌ను విచారించాలి: రాహుల్ గాంధీ డిమాండ్

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రధాని మోదీపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు.

అమెరికా, భారత చట్టాలను అదానీ ఉల్లంఘించారనే విషయంపై ఇప్పుడు స్పష్టత వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. మోదీ, అదానీల బంధం భారత్‌లో ఉన్నంత వరకే సురక్షితమన్నారు. తాజా ఆరోపణలపై తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలన్నారు. శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్నారు. తన అవినీతి ద్వారా దేశ ఆస్తులన్నీ అదానీ కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేసి విచారిస్తే విషయాలన్నీ బయటపడతాయన్నారు. ఆయనను రక్షిస్తున్న సెబీ చీఫ్‌ను ఆ పదవి నుంచి తొలగించి ఆమె పైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సంబంధం లేకుండా విచారణ జరిపించాలని రాహుల్ గాంధీ కోరారు. “అదానీ అరెస్టు కాదని, ఆయనపై విచారణ జరగదని నేను గ్యారంటీ ఇస్తాను. ఎందుకంటే ఆయన్ను మోదీ కాపాడుతున్నారు” అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

## అప్పుడు అదానీని కేజ్రీవాల్ అడ్డుకున్నారు..

దిల్లీ ఇంధన రంగంలోకి ప్రవేశించాలని అదానీ గ్రూప్ ఎంతగానో ప్రయత్నించిందని ఆమ్‌ఆద్మీపార్టీ నేత సంజయ్ సింగ్ వెల్లడించారు. అయితే ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ దానిని అడ్డుకున్నారని తెలిపారు. లంచం ఆరోపణలతో ఆ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో స్పందించిన ఆయన.. జవాబుదారీ అవసరమని అన్నారు.

భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు గౌతమ్ అదానీ, మరో ఏడుగురితో కలిసి అధికారులకు లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా ఎఫ్‌బీఐ చెబుతోంది. అదే సమయంలో బ్యాంకులు, ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు యత్నించినట్లు ప్రధానంగా ఆరోపణలు చేస్తోంది. ఈ ఆరోపణల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు కూడా ఉండటంతో ఆ దేశం దర్యాప్తు ప్రారంభించింది. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ బ్రియాన్ పీస్ ఆదేశాల మేరకు మొత్తం ఐదు అభియోగాలతో గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి.

ఈ క్రమంలో రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ..“అదానీ గ్రీన్ ఎనర్జీ గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో పవర్ సప్లై కాంట్రాక్టులు దక్కించుకుంది. దిల్లీ ఎలక్ట్రిసిటీ మార్కెట్‌లోకి ప్రవేశించాలని ప్రయత్నించింది. కానీ వీలుపడలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు” అని తెలిపారు. భాజపా దిల్లీలో అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెరగొచ్చని హెచ్చరించారు. తాజా వ్యవహారంపై తాము మౌనంగా కూర్చోబోమని, త్వరలో ప్రారంభంకానున్న సెషన్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు.

ఇదిలా ఉంటే.. సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచం ఇవ్వజూపారంటూ వచ్చిన అభియోగాలను అదానీ గ్రూప్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. చట్టాలకు లోబడి తమ గ్రూప్ నడుచుకుంటోందని వివరణ ఇచ్చింది. న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొంది.

## భారీగా పతనమైన అదానీ గ్రూప్ షేర్లు.. ఎందుకంటే..?

అదానీ గ్రూప్ భారీ సంక్షోభం ఎదుర్కొంటోంది. ఆ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై అమెరికాలో నేరాభియోగాలు నమోదుకావడంతో కంపెనీ షేర్లు భారీగా పతనం అయ్యాయి.

ఇంటర్నెట్‌డెస్క్: స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనం అవుతున్నాయి. అత్యధికంగా అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 20 శాతం వరకు విలువ కోల్పోయింది. ఓ భారీ కాంట్రాక్టు పొందేందుకు 265 మిలియన్ డాలర్ల (రూ.2,029 కోట్లు) లంచాలు ఇవ్వజూపినట్లు అమెరికాలోని బ్రూక్లిన్‌లోని ఫెడరల్ కోర్టు అభియోగాలు మోపడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ బ్రియాన్ పీస్ ఆదేశాల మేరకు మొత్తం ఐదు అభియోగాలతో గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి.

### ఏమిటీ ఆరోపణలు..

భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు గౌతమ్ అదానీ, మరో ఏడుగురుతో కలిసి అధికారులకు లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా ఎఫ్‌బీఐ చెబుతోంది. అదే సమయంలో బ్యాంకులు, ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు యత్నించినట్లు ప్రధానంగా ఆరోపణలు చేస్తోంది. ఈ ఆరోపణల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు కూడా ఉండటంతో ఆ దేశం దర్యాప్తు ప్రారంభించింది. ముఖ్యంగా రెండు అంశాలకు సంబంధించినవి. 2 బిలియన్ డాలర్ల విలువైన రెండు సిండికేట్ రుణాలకు సంబంధించిన అంశం వీటిల్లో ఒకటి. ఇక అంతర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థలు ఇచ్చిన భరోసాను చూపి అమెరికా, ఇతర ప్రదేశాల్లోని మదుపర్లకు ఆఫర్ చేసిన 1 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లకు సంబంధించినది రెండో ఆరోపణ.

### అదానీ స్కామ్‌లో జగన్ సర్కారు పేరు..?

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో జరిగిన ఒప్పందం స్కామ్‌లో జగన్ సర్కారు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు 228 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1750కోట్లు) లంచాలను పుచ్చుకొన్నట్లు బ్రూక్లిన్ కోర్టులో చేసిన ఆరోపణల్లో ఉంది. ఈ స్కామ్ మొత్తం 2019-24 మధ్య చోటు చేసుకోగా.. ఆ సమయంలో జగన్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అభియోగాల ప్రకారం.. 2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. నాడు విద్యుత్తు సరఫరా ఒప్పందంపై చర్చలు జరిగాయి. అదే సమయంలో 7,000 మెగావాట్‌ల కొనుగోలు డీల్ కుదరడానికి 'అవసరమైన ప్రతిపాదనలు' ముందుకొచ్చినట్లు ఆరోపణల్లో పేర్కొన్నారు. 2019-24 మధ్య పనిచేసిన ఓ అత్యున్నత స్థాయి వ్యక్తి హస్తం ఉన్నట్లు ఈ అభియోగాల్లో ప్రస్తావించారు.

### భారీగా విలువ కోల్పోయిన షేర్లు..

అదానీ గ్రూప్‌లోని పలు కంపెనీల షేర్లు భారీగా పతనం అయ్యాయి. ఏసీసీ 10%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 20%, అదానీ ఎంటర్ ప్రైజెస్ 20%, అదానీ గ్రీన్ ఎనర్జీ 18%, అదానీ పోర్ట్స్ 15%, అదానీ పవర్ 14%, అదానీ టోటల్ గ్యాస్ 15%, అదానీ విల్మార్ 10%, అదానీ సిమెంట్స్ 12% నష్టపోయాయి. మొత్తంగా గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుంచి 12.42 లక్షల కోట్లకు పడిపోయినట్లు ఫార్చ్యూన్ కథనంలో పేర్కొంది. ఈ గ్రూపులో పెట్టుబడిదారు అయిన అమెరికాకు చెందిన జీక్యూజీ పార్టనర్స్ షేర్లు కూడా 25% కుంగినట్లు సీఎన్‌బీసీ పేర్కొంది.

### అదానీ గ్రీన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ ఫైలింగ్..

తాజాగా అదానీ గ్రూప్ అమెరికా డాలర్ డినామినేటెడ్ బాండ్ ఆఫరింగ్‌లో ముందుకువెళ్లకూడదని నిర్ణయించుకొంది. ఈ విషయాన్ని గురువారం స్టాక్ మార్కెట్‌కు అందజేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. 'అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, ఎస్ఈసీలు గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా మా బోర్డు సభ్యులపై నేరాభియోగాలు మోపాయి. దీంతో ప్రతిపాదిత డాలర్ డినామినేషన్ బాండ్ల విషయంలో ముందుకువెళ్లకూడదని మా అనుబంధ సంస్థ నిర్ణయించింది” అని పేర్కొంది. ఈ ఆఫర్ విలువ 600 మిలియన్ డాలర్లు.

### అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ స్పందన..

జస్టిస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ

## నటుడు నాగార్జునపై వ్యాఖ్యల కేసు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే నాగార్జున, ఆయన కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. వాదనల సందర్భంగా నాగార్జున తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునపై కొండా సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. ఆ తర్వాత 'ఎక్స్'లో క్షమాపణ కోరుతూ పోస్ట్ పెట్టారన్నారు. ఎక్స్‌లో మంత్రి కొండా సురేఖ పెట్టిన పోస్టును ఆయన కోర్టు ముందు చదివి వినిపించారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అశోక్‌రెడ్డి అన్నారు. కచ్చితంగా కొండా సురేఖ క్రిమినల్ చర్యలకు అర్హురాలు అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వల్ల నాగార్జున కుటుంబం మానసికంగా ఎంతో కుంగిపోయిందని చెప్పారు.

తాజాగా ఈ పిటిషన్ కి మంత్రి కొండా సురేఖ కౌంటర్ వేసింది. కౌంటర్ ఇస్తూ కొండా మంత్రి సురేఖ నాంపల్లి స్పెషల్ కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దీంతో ఈరోజు కోర్టు ఆమె లాయర్ గురుమిత్ సింగ్ వాదనలు విననున్నారు. ఈ వ్యాజ్యంపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది. గాంధీ జయంతి సందర్భంగా బాపు ఘాట్‌లో నివాళులు అర్పించి కొండా సురేఖ మీడియాతో కేటీఆర్ గురించి ప్రస్తావిస్తూ.. 'ఎన్ కన్వెన్షన్ హాల్ కూల్చకుండా ఉండాలంటే సమంత నా దగ్గరకు రావాలని కేటీఆర్ కండిషన్ పెట్టాడు. నాగార్జున, నాగ చైతన్య మాట్లాడి సమంతను కేటీఆర్ దగ్గరికి వెళ్లాలని ఒత్తిడి చేశారు. కేటీఆర్ దగ్గరికి వెళ్ళడానికి సమంత ఒప్పుకోలేదు. కేటీఆర్ దగ్గరకి వెళ్ళకపోతే మా ఇంట్లో ఉంటే ఉండు.. లేకపోతే వెళ్ళిపో అన్నారు. అది భరించలేకనే సమంత విడాకులు తీసుకుంది' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## ఎన్నికల హామీలను విస్మరించిన రేవంత్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ పునరుద్ధరించడమే నా 7వ గ్యారంటీ అని రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చెప్పాడు. నేడు అధికారం చేపట్టాక మాట మార్చాడని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం తమ్మినేని ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా లగచర్లలో వామపక్ష నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టాక ప్రగతి భవన్ ముందున్న గేట్లు కూల్చి వేశాడు. అదొక్కటి తప్పా ఆయన చేసే పనులన్నీ అప్రజాస్వామ్యకంగానే నడుస్తున్నాయన్నారు. హైడ్రా కూల్చి వేతలు, మూసీ పరీవాహక ప్రాంతం, గ్రూప్ వన్ ఎగ్జామ్, దామగుండం ఇలా ప్రతి పనిని ఏకపక్షంగా చేశారని మండిపడ్డారు. లగుచర్లలో ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడం అన్యాయమన్నారు. గతంలోనే ఫార్మా సిటీ కోసం 13 వేల ఎకరాలు సేకరించారు. దానిపై రేవంత్ రెడ్డి వైఖరేంటో చెప్పాలన్నారు. ఇప్పుడు మళ్లీ లగుచర్లలో 13 వందల ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి పాలన అప్రజాస్వామికంగా కొనసాగుతుందని విమర్శించారు.

## అద్దె బకాయిలు చెల్లించని మాజీ ఎమ్మెల్యే

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్‌కు చెందిన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మాల్‌కి ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులుమరోమారు షాక్ ఇచ్చారు. జీవన్‌రెడ్డి మాల్‌కు మరోసారి ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. ఆర్మూర్ ఆర్టీసీ డిపో స్థలంలో నిర్మించిన వ్యాపార సముదాయం.. బకాయిలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. రూ.45.46 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలంటూ నోటీసులో పేర్కొంది. గతంలో జీవన్‌రెడ్డికి ఆర్టీసీ, విద్యుత్ అధికారులు షాక్ ఇచ్చారు. ఆర్మూర్‌లోని ఆర్టీసీ స్థలాన్ని అద్దెకు తీసుకుని ఆ స్థలంలో షాపింగ్ మాల్‌ని జీవన్‌రెడ్డి నిర్మించాడు. అయితే షాపింగ్ మాల్ అద్దెని గత కొంత కాలంగా కట్టకుండా ఎగ్గొడుతున్నాడు. సుమారుగా రూ.7.50 కోట్ల బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ అధికారులను బెదిరిస్తూ వస్తున్నాడు. అలాగే తన షాపింగ్ మాల్‌కి విద్యుత్ బిల్లులు కూడా చెల్లించడం లేదు. ఇన్నిరోజులుగా అధికార బలంతో జీవన్‌రెడ్డి బకాయిలు అడగడానికి వచ్చిన అధికారులపై చెలరేగిపోయాడు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆర్టీసీ , విద్యుత్ అధికారులు రంగంలోకి దిగి జీవన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి షాపింగ్ మాల్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. షాపింగ్ మాల్‌కి బకాయి ఉన్న నగదును వెంటనే చెల్లించాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఆర్టీసీ, విద్యుత్ అధికారులు హెచ్చరించారు.

బకాయిలు చెల్లించని నేపథ్యంలో ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మాల్‌కు గతంలో అధికారులు నోటీసులు అతికించి.. తాళం వేశారు. ఒప్పందం ప్రకారం విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ బాధ్యులు అ÷-దదె చెల్లించకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు జీవన్‌రెడ్డి మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్టు మైక్‌లో ప్రకటించారు. మాల్‌లో ఉన్న షాపుల యజమానులు సహకరించాలని కోరారు. 2013 జూన్1న బీఆర్ఎస్ ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో 7,059 చదరపు గజాల భూమిని విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ కింద 33 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. అయితే, 2017లో ఆ స్థలాన్ని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి టేకోవర్ చేసుకొని జీవన్‌రెడ్డి మాల్, మల్టీప్లెక్స్‌ను నిర్మించారు.

# కాంగ్రెస్ ముస్లిం అనుకూల ధోరణి మహారాష్ట్రలో బిజెపి ని గెలిపిస్తుందా?

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**





మహారాష్ట్రలో 20 వ తేదీన ప్రచారం ముగిసింది.రేపు ఎన్నికల ఫలితాలు వెలువడతాయి ఎక్జిట్ పోల్స్ అన్నీ బిజెపి కూటమి గెలుపును సూచిస్తున్నాయి. jarkand ఫలితాలు కూడా బిజెపి గెలుపును సూచిస్తున్నాయి.ఎక్జిట్ పోల్స్ అంచనాలు తారు మారు అవుతాయా! లేదా నిజం అవుతాయా! అని రేపు తెలిసిపోతాయి.కాకపోతే ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ముఖచిత్రం మత విభజన వైపు మళ్ళాయన్నది మాత్రం నిజం.ముస్లిం ఉలేమాలు,ముస్లిం నేతలు,వారితో పాటు వివిధ సంఘాలు ముస్లిం ఓటును కాంగ్రెస్ కూటమి కే వేయాలని పిలుపునివ్వడం వల్ల హిందూ ఓట్లు ఒకవైపు పోలరైజ్ అయ్యాయని వార్తలు వెలువడ్డాయి.బటేంగే తో కటేంగే అన్న నినాదం హిందువులను ఒక్కటి చేసిందని విశ్లేషకుల అంచనా.కులగణన డిమాండ్ కాంగ్రెస్ కొంప ముంచుతుంది అని అంటున్నారు. కులాలకు అతీతంగా హిందువులు ఒక్కటి అయ్యారని అంటున్నారు.కాంగ్రెస్ తలపై మోసిన ముస్లింల సంతుష్టీకరణ విధానంతో ఉద్ధవ్,శరద్ పవార్ లు పూర్తిగా కలిసి రాలేదని ఎన్నికల ప్రచార సరళి తెలిపింది.ముస్లిం కార్డు వాడితే హిందువుల నుండి వచ్చే నిరాదరణ దెబ్బతీస్తుందని ఉద్ధవ్ థాక్రే, శరద్ పవార్ లు ఊగిసలాడారని స్పష్టంగా కనిపించింది. హోరా హోరీగా సాగిన ఈ ఎన్నికల మత విభజన సామాజిక మర్యాదను తుత్తినియలు చేసాయన్నది స్పష్టం.కాంగ్రెస్ కూటమి ముస్లిం ఓట్ల కొరకు బిజెపి కూటమి హిందువుల ఓట్ల కొరకు తీవ్రంగా శ్రమించాయి.ఈ సందులో కాంగ్రెస్ తరపున ప్రచారానికి వెళ్లిన తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ముస్లింలను బుజ్జగించడానికి ముస్లిం రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించడం మహారాష్ట్ర తెలుగు ఓటర్లలో హిందూ సెంటిమెంట్ ను రెచ్చగొట్టింది.తెలంగాణలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని, మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి గెలిస్తే ముస్లిం రిజర్వేషన్లు ప్రవేశ పెడతామని చేసిన ప్రచారం హిందువుల్లో రియాక్షన్ తీసుకువచ్చింది.మహారాష్ట్రలో హిందూ మహిళలు మూకుమ్మడిగా పోలింగ్ బూత్ లకు కదలి రావడం కాంగ్రెస్ కు భయాందోళనలు రేపుతున్నది.మహారాష్ట్ర ఓటర్ల విజ్ఞత ఈ ఎన్నికల్లో కనిపించబోతున్నదని అంచనా.అభివృద్ధికి,వికసిత భారత్,ఆటల్ సేతుకు, దేశ ఎకానమీ వృద్ధి అనే అంశాలు చదువుకున్న ఓటర్లను బిజెపి కూటమి వైపు మళ్లించాయని పరిశీలకుల అంచనా.మహిళలు తమ సెక్యూరిటీకి, టెర్రర్ దాడుల నియంత్రణకు, టెర్రర్ ఫ్రీ ముంబాయికి, మహిళా లాడ్లి యోజన కు ఓటు వేశారని అంచనా నవీ ముంబై ఎయిర్ పోర్ట్, ఛత్రపతి శివాజీ, వీర సావర్కర్ లాపై మహారాష్ట్రీయులకు ఉన్న ఆరాధన సాదారణ మరాఠీలను ప్రభావితం చేశాయని అంచనా.పాల్గర్ సాధువుల హత్య అంశం హిందువులు మరచిపోలేదని అంటున్నారు.ఎన్నికలకు 48 గంటల ముందు సిద్ధి వినాయక్ మందిరం వక్ఫ్ బోర్డ్ దని ప్రకటించడం హిందువుల్లో ఆగ్రహం తెప్పించింది.సిద్ధి వినాయక్ మందిరం ముంబై తో పాటు మొత్తం మహారాష్ట్ర హిందువులకు పవిత్ర మందిరం.మాంసం తింటున్నామని ఎముకలు మెడలో వేసుకున్నట్టు కాంగ్రెస్ ముస్లింలను తలకెత్తుకోవడం వల్ల కాంగ్రెస్ కూటమి కొంప మునగడం ఖాయం అంటున్నారు.శివసేన ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే పనితీరు కూడా ప్రజలను సంతోష పరిచిందని అంచనా.పార్లమెంట్ ఎన్నికల్లో బలహీనంగా కనిపించిన ఎన్సిపి చీలిక నాయకుడు అజిత్ పవార్ ప్రదర్శన మెరుగయ్యిందని అంటున్నారు.ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలు కూటమిని మెజారిటీ వైపు నెట్టిందని అంచనా.అజిత్ పవార్ ఎన్సిపి కి సమర్థులైన అభ్యర్థులు కరువైన చోట బిజెపి తన నాయకులను ఎన్సిసి తరపున పోటీ చేయించిందని, అలాగే షిండే శివసేన సీట్లలో కూడా బిజెపి తన నాయకులను రంగం లోనికి దించిందని, బిజెపి ఈ ఎత్తుగడ కాంగ్రెస్ కూటమి గెలుపు వ్యూహాలను దెబ్బతీసే అవకాశాలను సూచిస్తున్నది.రేవంత్ రెడ్డి లాగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని, సెక్యులర్ మతం తీసుకున్న కొత్త భక్తుల అధికోత్సాహం, తొందరపాటు కాంగ్రెస్ కూటమిని దెబ్బ తీస్తుందని పరిశీలకుల అభిప్రాయం.jarkand అసెంబ్లీ ఎన్నికల్లో బంగ్లాదేశ్ ముస్లింల చొరబాటు అంశం ప్రధాన ఎన్నికలను మత విభజన వైపు తీసుకు పోయాయని స్పష్టంగా కనిపిస్తున్నది jarkand మొత్తంగా ఆదివాసీల రాష్ట్రం అటువంటి రాష్ట్రంలో ఆదివాసీల ప్రాంతంలో 15 అసెంబ్లీ సీట్లలో ముస్లింలు జన నిష్పత్తిని తారుమారు చేసారని అమాయక గిరిపుత్రులు ఆదివాసీలు బిర్సా ముండా పోరాట స్ఫూర్తిని అనుసరిస్తున్నారు.అలాగే యూపి లోని ఉప ఎన్నికలు కూడా బిజెపి కి కలిసి వస్తాయని విశ్లేషకుల అభిప్రాయం.ఇక కేరళలో వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ పోటీ కూడా ఆసక్తిని రేపుతున్నది.వయనాడ్ లో ముస్లింల ఓట్లు అధికం.కాని, వక్ఫ్ బోర్డు ఆగడాలతో బెంబేలెత్తిన క్రైస్తవులు బిజెపి తో జత కట్టడం ఆసక్తిగా మారింది.ఈ క్రైస్తవ హిందూ ఐక్యత తో బిజెపి వయనాడ్ లో గెలిచినా ఓడినా భవిష్యత్ రాజకీయాలకు ఒక దిక్సూచి గా మారడం స్పష్టంగా కనిపిస్తున్నది.

## మేడ్చల్ ను కమ్మేస్తున్న గాలి కాలుష్యం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

### మెల్ల మెల్లగా మేడ్చల్ ను కాలుష్య భూతం ఆవహిస్తున్నది.




ప్రపంచంలో అత్యంత కాలుష్యపూరితమైన రాజధాని ఢిల్లీ. అత్యంత కాలుష్యపూరితమైన దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది.మనదేశంలో అత్యంత కలుషిత వాయు రాంకింగ్ లో హైద్రాబాద్ ది 4 వ స్థానం.ఢిల్లీ,కోల్కతా,ముంబై తర్వాత హైద్రాబాద్ ఏ,క్యూ,ఐ స్థాయి ప్రమాద స్థాయికి దగ్గరలో ఉంది.హైద్రాబాద్ కు ఆనుకుని ఉన్న మేడ్చల్ నగరీకరణ వైపు వేగంగా కదులుతున్నది.వివిధ పరిశ్రమలు వాహనాల వల్ల మేడ్చల్ లో వాయు కాలుష్య స్థాయి రోజు రోజుకు దిగజారుతున్నది.గాలి నాణ్యతను ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ లో కొలుస్తారు.ఏ క్యూ ఐ ని గ్రౌండ్ లెవల్ (నేల స్థాయి) ఓజోన్, పార్టికల్ పొల్యూషన్(కణ కాలుష్యం),కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, అమోనియా డయాక్సైడ్, లెడ్ డయాక్సైడ్ లెవల్స్ చూసి గాలి నాణ్యతను కొలుస్తారు.ఈ 6 రకాల పదార్థాల కలయికతో కూడిన కొలతను ఏ.క్యూ.ఐ.అంటారు.ఈ ఏ.క్యూ.ఐ బేసిక్స్ ను ఆకుపచ్చ,పసుపు,నారింజ,ఎరుపు, ఊదా,మెరూన్ రంగులో సూచిస్తారు.ఆకుపచ్చ రంగు సూచిక మంచిదిగా, మెరూన్ రంగు ప్రమాద సూచికగా పేర్కొంటారు.స్థాయి అంటే ఆరోగ్యకర వాతావరణ స్థాయి.250 మైక్రాన్ ల స్థాయి ప్రమాద స్థాయి.హైద్రాబాద్ 118 మైక్రాన్ స్థాయి దాటింది.అంటే సున్నిత స్థాయి దాటి హెచ్చరిక స్థాయికి చేరుకున్నది.మేడ్చల్ కాలుష్య స్థాయి 109 కి దగ్గర అటూ ఇటూ తారట్లాడుతున్నది.ఇప్పుడు మేడ్చల్ ను నగర జీవన కాలుష్యం కాటు వేస్తున్నది.గాలి కాలుష్యం వల్ల ఎలాంటి జబ్బులొస్తాయి? సూక్ష్మకణాలు, ఇతర కాలుష్య కారకాలు ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తాయని, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేస్తాయని, రక్తంలో ఆక్సిజన్ స్థాయిని తగ్గిస్తాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.పిల్లలు, వృద్ధులు, పోషకాహారలోపం, సౌకర్యాల లేమితో బాధపడే పేదల్లో శ్వాసకోససమస్యలు, గుండె సంబంధిత రోగాలు, గుండెపోటు, లంగ్ క్యాన్సర్ వంటివి వస్తాయని ఆయన తెలిపారు.ఉదాహరణకు ఆస్తమాపై ఓజోన్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్ వంటివి ఊపిరితిత్తుల వాపు, ఊపిరితిత్తుల పనితీరు మందగించడం వంటి వాటికి కారణమవుతాయి.గర్భస్థ శిశువుల ఆరోగ్యంపైనా నాణ్యత లేని గాలి ప్రభావం ఉంటుందని, కొన్నిసార్లు చనిపోయిన పిల్లలు పుడతారని, అబార్షన్లు జరుగుతాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.గాలి కాలుష్యం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఏటా 70 లక్షల మంది తమ ఆయుర్దాయం కన్నా ముందే చనిపోతున్నారని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.మేడ్చల్ లో మెల్ల మెల్లగా పెరుగుతున్న కాలుష్యం పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.మేడ్చల్ ఒకప్పుడు చిన్న గ్రామం. క్రమంగా పట్టణ స్థాయికి చేరింది.ఇప్పుడు నగర హంగులు సమకూర్చుకుంటున్నది.కాలుష్య ప్రభావాన్ని అధికారులు ముందుగా గుర్తించి,తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.కమ్ముకుంటున్న ఈ కాలుష్య భూతం నుండి ప్రజారోగ్యాన్ని కాపాడుకునే భాధ్యత అందరిదీ.సున్నిత స్థాయి హెచ్చరిక దాటుతున్న మేడ్చల్ ను ప్రభుత్వం తో కలిసి ప్రజలు కాపాడుకోవాలి.ఆరోగ్య శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞులు కోరుతున్నారు.

## ఎస్ యూ వీ సీ ని సన్మానించిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు

**కరపత్రం న్యూస్ కరీంనగర్::నవంబర్21**



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ( ఎస్ యూ) వైస్ ఛాన్సలర్ (వీ సీ) ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ ను మొదటి సారిగా కలిసిన నేపథ్యంలో గురువారం రోజున సాయంత్రం యూనివర్సిటీ పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఒక పూల మొక్కను కూడ వీ సీ కి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లాలోని ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరికెల అశోక్,మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య, డాక్టర్ ముత్యం రెడ్డిలతో పాటు గోదావరిఖని, హుజురాబాద్, జమ్మికుంట, పెద్దపల్లి, హుస్నాబాద్ తదితర కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.అనంతరం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి శ్రీ రంగ ప్రసాద్, వీ సీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.శాతవాహన యూనివర్సిటీని అగ్రస్థానంలో నిలపాలని వక్తలు ఆకాంక్షించారు.

## దుబాయ్ లో మొగిలిపేట వాసి ఆత్మ హత్య

**కరపత్రం న్యూస్ :మల్లాపూర్:: నవంబర్ 21**

మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ (35) గత కొన్ని సంవత్సరాలనుండి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్తూ వస్తున్నాడు అయితే బుధవారం రోజున దుబాయ్ లో ఉరి వేసుకొని ఆత్మ హత్య కి పాల్పడ్డాడు ఆత్మ హత్య కి సంబందించిన కారణాలు తెలియరలేదు మృతదేహన్ని తొందరగా రప్పించాలని స్థానికులు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు

## జె.వి.వి చెకుముకి సంబరాల విజేతలు వీరే..

**కరపత్రం న్యూస్: ఖమ్మం, నవంబర్ 21:**

జనవిజ్ఞాన వేదిక సతుపల్లి మండల స్థాయిలో ప్రతిభా పరీక్షతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించింది.టాలెంట్ టెస్ట్ విభాగంలో ప్రభుత్వ తెలుగు మీడియంలో కిస్టారం ఉన్నత పాఠశాల,సత్తుపల్లి పాత సెంటర్ ఉన్నత పాఠశాలలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు పొందగా ఇంగ్లీష్ మీడియంలో తుంబూరు ఉన్నత పాఠశాల ,బాలికొన్నత పాఠశాల సత్తుపల్లి లు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు పొందాయి.ప్రైవేట్ పాఠశాలల విభాగంలో కె.పీ. ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా వి.వి.విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు.చిత్రలేఖనం లో పాత సెంటర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రభియా భాను ప్రథమ,టాలెంట్ స్కూల్ విద్యార్శిని పవిత్ర ద్వితీయ,గంగారారం ఉన్నత పాఠశాల విద్యార్థిని శేష తృతీయ స్థానం సాధించారు.చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి చరణ్,మైనారిటీ స్కూల్ విద్యార్థి హకుముల్లా ప్రత్యేక బహుమతులు పొందారు.వ్యాసరచన విభాగంలో సత్తుపల్లి బాలికొన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ప్రసన్న ప్రథమ,వి.వి.విద్యాలయం విద్యార్శిని జాహ్నవి ద్వితీయ ,పాత సెంటర్ ఉన్నత పాఠశాల విద్యార్శిని తులసి తృతీయ స్థానం సాధించగా గంగారాం ఉన్నత పాఠశాల విద్యార్థిని శైలు ,చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని క్రిస్టినా ప్రత్యేక బహుమతులు అందుకున్నారు.

### జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఈనెల 28 న జరగనున్న జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షకు కిష్టారం ఉన్నత పాఠశాల విద్యార్థులు కార్తీక్,సంతోష్ తుంబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు,కె.పీ .ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్శులు హనీష్,శ్రావణ్ సాత్విక్ లు జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ కు ఎంపికయ్యారు.చెకుముకి సంబరాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జె.వి.వి జిల్లా అధ్యక్షుడు విమోహన్,జిల్లా కార్యదర్శి కంభంపాటి వెంకటేష్ జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ పురుషోత్తరావు,మండల బాద్యులు ప్రసాద్,రత్నాకర్,జానీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం పై కమిషనర్ కు పిర్యాదు

**కరపత్రం న్యూస్ కోరుట్ల: నవంబర్ 21:-**

కోరుట్ల పట్టణంలో జాతీయ రహదారి ప్రక్కన అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని తొలగించాలని మున్సిపల్ కౌన్సిలర్ పెండం గణేష్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి కి పిర్యాదు చేశారు.అనంతరం పెండెం గణేష్ మాట్లాడుతూ పట్టణంలోని జాతీయ రహదారి 63 కి అనుకొని అక్రమంగా 8 దుకాణాల సముదాయాలను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నారాన్ని జాతీయ రహదారి మధ్య నుండి 100 ఫీట్లు వదిలి నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిల్ లో తీర్మానం కూడా చేశారని అయినా కూడా కొంతమంది రోడ్డు ను ఆక్రమించి నిర్మాణలు చేసిన కూడా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై ఆయన ఆసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అట్టి నిర్మాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం నవంబర్ 22 2024



# ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇది నాలో స్ఫూర్తి నింపుతుంటుంది: సమంత

ఇంటర్నెట్ డెస్క్: సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు నటి సమంత. తాజాగా సామ్ తనకు ఇష్టమైన పద్యాన్ని షేర్ చేశారు. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా ఈ పద్యం తనలో స్ఫూర్తినింపుతుందని పేర్కొన్నారు. “మిమ్మల్ని అందరూ నిందిస్తున్నప్పుడు.. మీరు తలెత్తుకొని నిలబడితే.. పురుషులందరూ మిమ్మల్ని అవమానించినప్పుడు, మిమ్మల్ని మీరు నమ్మితే..” అంటూ సాగే పద్యాన్ని సమంత షేర్ చేశారు. దీన్ని మీ అందరితో పంచుకోవాలని ఉందని క్యాప్షన్ పెట్టారు. “విజయాలన్నింటినీ పక్కనపెట్టి ఒక్కసారి రిస్క్ చేసినప్పుడు.. అక్కడ ఓడిపోతే మళ్లీ కొత్తగా ప్రయాణాన్ని మొదలుపెట్టాలి. అంతేగానీ, ఆ ఓటమి గురించే ఆలోచిస్తూ కూర్చోకూడదు. మన హృదయాన్ని మరింత కఠినంగా మార్చుకుని సుదీర్ఘ ప్రయాణం కోసం ధైర్యంగా ముందుకు కదలాలి. మీ దగ్గర ఏమీ లేనప్పుడు సంకల్పం అనేదాన్ని గట్టిగా పట్టుకోండి.. అప్పుడు మనల్ని నిందించేవారికి సరైన సమాధానం చెప్పొచ్చు” అనే అర్థంలో ఉన్న పద్యాన్ని సమంత షేర్ చేశారు.ఇక సినిమాల విషయానికొస్తే.. సమంత ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ అనే సినిమాను ప్రకటించారు. సొంత నిర్మాణంలోనే ఆ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే ఆమె ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పేరుతో ఓ నిర్మాణసంస్థని ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులోనే ఈ సినిమా తెరకెక్కనుంది. చిత్ర దర్శకుడు ఎవరు? ఇతరత్రా విషయాలేమిటనేది త్వరలోనే వెల్లడించనున్నారు. మరోవైపు సమంత నటించిన యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ ‘సిటాడెల్: హనీ బన్నీ’ అమెజాన్ వేదికగా స్ట్రీమింగ్ అవుతూ అందరి ప్రశంసలు

# ఇది భారతీయ సినిమా గొప్పతనం



గోవాలోని పనాజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోంది. ఈ సినీ పండుగకు అగ్ర కథానాయకుడు నాగార్జున, అమలతో పాటు మరికొందరు కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. వేడుకలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.‘ఈ కార్యక్రమంలో మా నాన్నగారికి నివాళి అర్పించనున్నారు. నేను ఈ ఈవెంట్‌కు రావడానికి ప్రధాన కారణమిదే. ఈ ఏడాది ఆయన శతజయంతిని ఇక్కడ చేయాలని నిర్ణయించడం ఆనందం కలిగించింది. నాన్న గారు నటించిన సినిమాల్లో ఏది రీమేక్ చేస్తారని నన్ను అడిగితే సమాధానం చెప్పలేను. ఆయన 251 సినిమాల్లో నటించారు. వాటిలో ఏది ఇష్టం అని అడిగినా చెప్పలేను. ఆయన సినిమాను ఏదో ఒకదాన్ని రీమేక్ చేయడానికి ప్రయత్నిస్తాను. నాకు అన్నితరాల్లోనూ అభిమానులున్నారు. అది నా గొప్పతనం కాదు.. భారతీయ సినిమా గొప్పతనం. ఇండియన్ సినిమా సంస్కృతికి పెద్దపీట వేస్తుంది’ అని నాగార్జున అన్నారు.ఇక ఈ ఏడాది జరుగుతోన్న భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) తెలుగు వారందరికీ ప్రత్యేకం కానున్న విషయం తెలిసిందే. భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన నలుగురు ప్రముఖుల శత జయంతుల సందర్భంగా వారికి నివాళులర్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలుగు సినీదిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) ఆ నలుగురిలో ఒకరు కాగా, మిగతా ముగ్గురు.. ‘షోమేన్ ఆఫ్ ఇండియన్ సినిమా’ రాజ్‌కపూర్, మధుర గాయకుడు మహమ్మద్ రఫీ, బెంగాలీ దర్శకుడు తపన్‌సిన్హా. 8 రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వీరి చలన చిత్రాల ప్రదర్శన, సంగీత విభావరి, ఛాయాచిత్ర ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయి.

# పుష్ప గాడి ప్రభంజనానికి రంగం సిద్ధం..

## గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఎప్పుడు.. ఎక్కడంటే?




పుష్ప రాజ్ మాస్ జాతరకు రంగం సిద్ధమైంది. ఇటీవలే ట్రైలర్ లాంచ్ ఈవెంట్ తో బీహార్ మొత్తం అభిమానుల ఈలలతో మోగిపోయింది. అక్కడికి వచ్చిన లక్షలమంది ఆడియన్స్ అరుపులతో ఇండియా షేక్ అయ్యే ప్రభంజనం పాట్నా పుట్టించింది.ఈ నేపథ్యంలో పుష్ప 2 మేకర్స్ మరో గ్రాండ్ ఈవెంట్?కి సిద్ధం చేశారు. “మక్కలే, సింగర చెన్నై లా ఓరు స్పెషల్ ఈవెనింగ్ కు సిద్ధంగా ఉన్నారా? నవంబర్ 24న సాయంత్రం 5 గంటల నుండి పుష్ప వైల్డ్‌ఫైర్ ఈవెంట్.. లియో ముత్తు ఇండోర్ స్టేడియం, సాయి రామ్ ఇంజినీరింగ్ కళాశాలలో” జరగనుంది అని ట్విట్టర్ X లో వివరాలు వెల్లడించారు. బీహార్ లో భీభత్సం సృష్టించిన అల్లు అర్జున్.. ఇక చెన్నైలో విధ్వంసం పుట్టిస్తాడో చూడాలి.పుష్ప 2 డిసెంబర్ 5న రిలీజ్ అవుతుండటంతో.. ఇండియా వైడ్ గ్రాండ్?గా ప్రమోషన్స్ చేయనున్నారు. త్వరలో ‘తెలుగు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి’ రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీ లేదా ఎల్బీ స్టేడియంలో ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్?ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి మేకర్స్ పనులు స్టార్ట్ చేశారట. రానున్న ఈ రెండ్రోజుల్లో ‘రామోజీ ఫిలిం సిటీ లేదా ఎల్బీ స్టేడియం’ లో ఏదో ఒకటి కన్ఫమ్ చేయనున్నారట. ఇక పుష్పాగాడి మాస్ జాతర మోతమోగిపోవాల్సిందే.

# ఇతర భాషల హీరోలతో పాటు తెలుగు వారిని ప్రోత్సహించండి



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ నెటిజన్లతో ముచ్చటిస్తుంటారు నటుడు బ్రహ్మాజీ. తాజాగా ఆయన పెట్టిన ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రతి శుక్రవారం కొత్త చిత్రాలు ప్రేక్షకుల ముందుకువచ్చే విషయం తెలిసిందే. వీటిపై బ్రహ్మాజీ పోస్ట్ పెట్టారు. తెలుగు వారిని ప్రోత్సహించాలని కోరారు. ‘మలయాళం, తమిళ హీరోలతో పాటు మన టాలెంటెడ్ తెలుగు హీరోలను కూడా ప్రోత్సహించండి’ అని కోరారు. ఈ శుక్రవారం విడుదల కానున్న సినిమాలన్నీ బాగుంటాయి అనే అర్థం వచ్చేలా ఒక హార్ట్ సింబల్‌ను పోస్ట్ చేశారు . దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ‘కంటెంట్ ఉన్న సినిమాలు ఎప్పుడూ హిట్ అవుతాయి’ అని కామెంట్స్ పెడుతున్నారు.ఇక ఈ శుక్రవారం ఏకంగా నాలుగు తెలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకురానున్నాయి. మహేశ్ బాబు మేనల్లుడు ‘దేవకీ నందన వాసుదేవ’తో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. తెలుగమ్మాయి, మిస్ ఇండియా మానస వారణాసి ఈ సినిమాతో తెరంగేట్రం చేస్తున్నారు. ‘హనుమాన్’ ఫేమ్ ప్రశాంత్ వర్మ రాసిన కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల ఈ సినిమాని తెరకెక్కించారు.‘జీబ్రా’తో తనలోని ఓ కొత్త నటుడిని చూస్తారంటున్నారు సత్యదేవ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం ‘జీబ్రా’. డాలీ ధనంజయ మరో కథానాయకుడు. ప్రియ భవానీశంకర్, జెన్నీఫర్ పిషినాటో కథానాయికలు. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఈ సినిమా ప్రమోషన్‌లో చిరంజీవి కూడా భాగం కావడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. విష్వక్‌సేన్ హీరోగా రవితేజ ముళ్లపూడి తెరకెక్కించిన చిత్రం ‘మెకానిక్ రాకీ’. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. ఈ సినిమా కూడా శుక్రవారం విడుదల కానుంది. వీటితో పాటు హర్ష నర్రా, సందీప్ సరోజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘రోటి కపడా రొమాన్స్’ కూడా ప్రేక్షకుల ముందుకురానుంది.